సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం ǀ 16 ǀ ఏప్రిల్ ǀ 2023



అన్నదానానికి రూ.లక్ష విరాళం

వేములవాడ: రాజన్న అన్నదానానికి నాసిక్ మున్సిపల్ కమిషనర్ చంద్రకాంత్ గుడెవార్ రూ.లక్ష విరాళాన్ని పీఆర్వో చంద్రశేఖర్, పర్యవేక్షకులు శ్రీరాములుకు అందజేశారు.



శ్రీనివాసదీక్షలు ప్రారంభం

బోయినపల్లి(వేములవాడ): తడగొండలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీనివాసదీక్షలు ప్రారంభమయ్యాయి. ఏటా 21 రోజులు మాల ధరిస్తారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0/26.0

ఆకాశం మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

ఇహలోక జీవితం కొన్ని రోజులే - కీర్తిప్రతిష్టలే శాశ్వతమైనవి.

- మహమ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
ఆది	6:36	సోమ	4:32

స్టార్ సిటీ

- సినీ విజయోత్సవాలకు వేదికగా కరీంనగర్ స్మార్ట్ సిటీ
- ఈ ఏడాదిలో ఇప్పటికే నాలుగు సక్సెస్ మీట్‌లు

సండే స్పెషల్

స్మార్ట్ సిటీ.. స్టార్ సిటీగా మారుతోంది. ఉత్తర తెలంగాణ గుండెకాయ కరీంనగర్ జిల్లా అంటేనే ఉద్యమాలు.. విప్లవాలకు నిలయంగా ఉండేది. నేడు కళలు.. కళాకారులకు మారుపేరుగా మారుతోంది. ఉద్యమాల కరీంనగర్ గడ్డపై సినీవెలుగులు మెరుస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇక్కడి యాసకు సినిమాలో పెద్ద పీట వేస్తుండడంతో ఈ ప్రాంత ప్రజలు గుర్తిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన యువకులు దర్శకులుగా, నటీనటులుగా రాణిస్తుండడంతో ఇక్కడే ఆడియో రిలీజ్ వేడుకలు.. విజయోత్సవాలు.. సక్సెస్‌మీట్స్ నిర్వహిస్తున్నారు. వెండితెర వెలుగుల్లో కరీంనగర్ ప్రస్థానంపై సండే స్పెషల్..

- 8లో ▸



న్యూస్‌రీల్

రాజన్న ఆదాయం రూ.1.46 కోట్లు



వేములవాడ: రాజన్నకు 18 రోజుల్లో భక్తుల ద్వారా రూ.1.46 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీలను లెక్కించారు. 550 గ్రాముల బంగారం, 13.100 కిలోల వెండి సమకూరినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మె నోటీసు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవో లచ్చాలుకు సమ్మె నోటీస్ అందజేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఈనెల 28 నుంచి జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. జేపీఎస్‌లను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలని, గత నాలుగేళ్లను సర్వీసుకాలంగా గుర్తించాలని, ఓపీఎస్‌లకు పదోన్నతి కల్పించి జేపీఎస్‌లుగా గుర్తించాలని కోరారు. మరణించిన కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈ నెల 11తో తమ ప్రొబేషనరీ పీరియడ్ ముగిసిందని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. జేపీఎస్ సంఘం మండలాధ్యక్షుడు కె.జనార్దన్, ఉమెన్ జేపీఎస్ అధ్యక్షురాలు మమతారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు



వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిలో శనివారం 8 కంటి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. కంటిలో మోతిబిందు పొరతో బాధపడుతూ చూపు మందగించి కంటివైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన దుర్గయ్య, లక్ష్మి, ప్రమీల, హనుమయ్య, ఏరా, శంకర్, లక్ష్మి, దేవమ్మలకు ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు చేసినట్లు వివరించారు. ఆస్పత్రి వైద్యులు అనిల్‌కుమార్, రత్నమాల, నర్సింగం, రాజేందర్ ఉన్నారు.


అర్హులకు పోడు పట్టాలు పంచాలి



సిరిసిల్లటౌన్: దశాబ్దకాలంగా పోడుభూముల్లో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించాలని లంబాడి ఐక్యవేదిక(లైఫ్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి మాట్లాడారు. రాష్ట్రంలో పోడు వ్యవసాయంపై సర్వే చేపట్టిన అధికారులు పట్టాలు ఇవ్వకపోగా.. ఆయా స్థలాల్లో చెట్లు నాటుతున్నారన్నారు. సేవాలాల్‌తండాలో వ్యవసాయంపై ఆధారపడిన నిరుపేద గిరిజనులు ఇరువై ఏళ్లకు పైగా పోడు భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. అర్హులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. లైఫ్ నాయకులు మంగ్యానాయక్, పాపారావు నాయక్, రాజునాయక్, నారాయణ, అమృత, యమున, బాబు పాల్గొన్నారు.

మన ఈవీఎంలు భద్రమేనా..!

- నాలుగేళ్ల నాలుగు నెలలుగా సాయుధ రక్షణ
- సిరిసిల్ల కాలేజీ స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు
- కోర్టుకెక్కిన కాంగ్రెస్ అభ్యర్థులు
- బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేశారని అప్పట్లో కేసు
- జగిత్యాలలో కీ మిస్ నేపథ్యంలో చర్చకు..



సిరిసిల్లలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద సాయుధ పోలీస్ రక్షణ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు 2018 డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాలపై అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో అధికార టీఆర్ఎస్(బీఆర్ఎస్) పార్టీ అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంటూ హైకోర్టులో వేర్వేరుగా రెండు కేసులు వేశారు. దీంతో 2018 ఎన్నికల నాటి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను ఇప్పటికీ భద్రపరిచారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల తాళం చెవి మిస్సయిన సంఘటన నేపథ్యంలో సిరిసిల్లలోని ఈవీఎంలు భద్రమేనా అనే అనుమనాలు కలుగుతున్నాయి. సిరిసిల్ల జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూముల్లో ఈవీఎలు, వీవీప్యాట్స్‌ను భద్రపరిచారు. ఆ స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటలపాటు సాయుధ పోలీసు రక్షణ కొనసాగుతోంది.

ఇదీ కోర్టు కేసు నేపథ్యం

సిరిసిల్ల, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థులు కె.కె.మహేందర్‌రెడ్డి, ఆది శ్రీనివాస్ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తీరుపై కోర్టులో కేసు ఫైల్ చేశారు. దీంతో 2018 డిసెంబరు 7న జరిగిన ఎన్నికల ఈవీఎంలను, వీవీ ప్యాట్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం వద్ద సాయుధ భద్రతను కల్పించారు. అప్పటి సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డి అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కె.తారక రామారావుపై పలు అభియోగాలతో కోర్టులో కేసు వేశారు. కులసంఘాలతో సమావేశం నిర్వహించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి హామీలు ఇచ్చారని, డాక్టర్లతో సమావేశం నిర్వహించి సంఘ భవనానికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారని, కుల సంఘాల వారితో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి వారిని ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగిన తేదీ ఈవీఎంల్లో డిసెంబరు 6గా నమోదైన విషయాన్ని మహేందర్‌రెడ్డి ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు తేదీ ఎలా ఉంటుందని ఫిర్యాదులో ప్రస్తావించినట్లు సమాచారం. బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినా.. ఆయన పట్టించుకోలేదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కె.కె.మహేందర్‌రెడ్డి ఫిర్యాదుపై హైకోర్టు విచారణకు స్వీకరించకుండా.. తిరస్కరించకుండా అప్పట్లో నిలిపివేసింది. దీంతో కోర్టు ఎప్పుడు ఎలా స్పందిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఈవీఎంలను సాయుధ రక్షణతో భద్రంగా ఉంచారు.

ఇదీ 'ఆది' ఫిర్యాదు

వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సైతం అధికార టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చెన్నమనేని రమేశ్ బాబుపై కోర్టులో ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో కులసంఘాలకు నిధులు మంజూరు చేసినట్లుగా ఎమ్మెల్యే లెటర్‌ప్యాడ్‌పై రాసి ఇచ్చారని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని పేర్కొన్నారు. మరోవైపు తాను 2009లో వేసిన పౌరసత్వం కేసు కోర్టు విచారణలో ఉందని, రమేశ్‌బాబు భారత పౌరుడు కాదని ఆరోపించారు. వేములవాడ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను క్రోడీకరిస్తూ కోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు తన నిర్ణయాన్ని పెండింగ్‌లో ఉంచింది. 2018 డిసెంబరు ఎన్నికల్లో ఆది శ్రీనివాస్‌పై రమేశ్‌బాబు 28,156 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రమేశ్‌బాబు పౌరసత్వం కేసు కోర్టు విచారణలో ఉంది. మొత్తం వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ ఆది శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించారు.

ఈవీఎంలపై ఉత్కంఠ

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల నియోజకవర్గంలో 270 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వేములవాడలో 231 కేంద్రాలు ఉన్నాయి. 2018 డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను వీవీప్యాట్‌లను మళ్లీ ముట్టుకోకుండానే 2019లో పార్లమెంట్ ఎన్నికలను సైతం అధికారులు నిర్వహించారు. అప్పట్లో పొరపాటున ఈవీఎంలను తెరిచిన వికారాబాద్ కలెక్టర్ సయ్యద్ ఉమరల్ జలీల్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోనూ స్ట్రాంగ్‌రూమ్‌కు భద్రత కల్పించారు. జగిత్యాల సంఘటన నేపథ్యంలో సిరిసిల్లలో ఈవీఎంలు భద్రంగా ఉన్నాయా.. అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. జిల్లా అధికారులు మాత్రం స్ట్రాంగ్‌రూమ్‌లను ప్రత్యేకంగా నిరంతరం పర్యవేక్షిస్తూ.. రక్షణ కల్పిస్తున్నారు.

వర్షం నీరు భూమిలోకి ఇంకేలా చూడాలి

- నీటి సంరక్షణపై అవగాహన పెంచాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: వర్షం నీరు భూమిలోకి ఇంకేలా వాటర్ షెడ్ పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ కోరారు. న్యూఢిల్లీ నుంచి నేషనల్ వాటర్‌మిషన్ అదనపు సెక్రెటరీ అర్చనవర్మ శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని కరువు పీడిత జిల్లాల జాబితాలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఉందని ఆమె వివరించారు. 2023లో జిల్లాలో నీటిసంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను అర్చనవర్మ సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ జిల్లాలో నీటిని అధికంగా వినియోగించే ప్రాంతాలపై దృష్టిసారించి నీటి పొదుపు ఆవశ్యకతను వివరిస్తామన్నారు. నీటిని నిలువచేసే పనులు చేపడతామని, వాటర్ రీచార్జి నిర్మాణాలు చేస్తామన్నారు. నీటి పరిరక్షణకు ప్రణాళిక సిద్ధం చేస్తామని వెల్లడించారు. జిల్లా ఇరిగేషన్ ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి జి.నర్సింహులు, డీఆర్‌డీఏ ఏపీడీ నర్సింహులు పాల్గొన్నారు.

పోర్టిఫైడ్ బియ్యంతో అనేక ప్రయోజనాలు

సిరిసిల్ల: జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ బియ్యంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం పౌరసరఫరాలశాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పోర్టిఫైడ్ బియ్యం తినడం ద్వారా రక్తహీనతను నివారిస్తుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నిరుపేదలకు పోషకాహారం లభించకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. గతేడాది పలు జిల్లాలో అమలు చేయగా సత్ఫలితాలు వచ్చాయని.. ఈ నేపథ్యంలోనే మన జిల్లాలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోర్టిఫైడ్ బియ్యం ధర బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.65 ఉంటుందని, ప్రభుత్వమే ఈ మొత్తాన్ని భరిస్తుందని తెలిపారు. అపోహలకు గురికాకుండా సాధారణ బియ్యం లాగే వండుకుని తినాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీపీఆర్వో మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

పీఆర్సీ డబ్బులు అందించాలి

- పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్
- నిరవధిక సమ్మెలో కార్మికులు



సమ్మెకు దిగిన సిరిసిల్ల మున్సిపల్ కార్మికులు

సిరిసిల్లటౌన్: పెరిగిన పీఆర్సీ ప్రకారం పెండింగ్‌లో ఉంటున్న ఎనిమిది నెలల పెంచిన వేతనం వెంటనే అందివ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు శనివారం నుంచి సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మూశం రమేశ్ మాట్లాడారు. 2021 జూన్ నుంచి 2022 జనవరి వరకు పెరిగిన పీఆర్సీ డబ్బులు చెల్లించాలని, 2009 నుంచి 2012 వరకు పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. విలీన గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్ డబ్బులు మూడేళ్లుగా చెల్లించడం లేదన్నారు. డ్రైవర్లకు వేతనాలు సకాలంలో అందడం లేదని ఆగ్రహం వ్యకం చేశారు. మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలోనే పారిశుధ్య కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. స్మార్ట్ సిరిసిల్ల, స్వచ్ఛ సిరిసిల్లగా జాతీయస్థాయిలో అవార్డులను సాధించడంలో ప్రధానమైన పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కోడం రమణ, చంద్రయ్య, గణేశ్, రాజు పాల్గొన్నారు.

మండుటెండల్లో మత్తడి సవ్వడి



ముస్తాబాద్(సిరిసిల్ల): మండుటెండల్లో మత్తడి సవ్వడి వినిపిస్తోంది. ఒకప్పుడు నిండు వేసవిలో గొంతు తడుపుకునేందుకు భగీరథ ప్రయత్నం చేసిన జ్ఞాపకాలు ఈ ప్రాంత ప్రజలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. కానీ నేడు ఎండలు దంచికొడుతున్న ఏప్రిల్ నెలలో ముస్తాబాద్ పెద్దచెరువు మత్తడి పోస్తుంది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాల్వ ద్వారా ముస్తాబాద్ పెద్ద చెరువుకు గోదావరి జలాలను మళ్లించారు. పక్షం రోజులుగా వస్తున్న గోదావరి జలాలతో పెద్ద చెరువు మత్తడి దూకుతోంది. ఈ జలదృశ్యాలను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. మరోవైపు ముస్తాబాద్, తెర్లుమద్ది, పోతుగల్ గ్రామాలలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి.

లారీ ఢీకొని యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- కొదురుపాక కట్ట వద్ద ప్రమాదం
- మృతుడు నేపాల్‌వాసి
- రాత్రి వేళ సంఘటన



మృతిచెందిన భరత్



గాయపడ్డ రాజేశ్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో కొదురుపాక మిడ్‌మానేరు కట్ట పరిసరాల్లో శనివారం రాత్రి లారీ ఢీకొని ఒక యువకుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే నేపాల్‌కు చెందిన భరత్(22), రాజస్థాన్‌కు చెందిన రాజేశ్ వేములవాడ వైపు వెళ్లి తిరిగి బైక్‌పై బావుపేటకు వస్తున్నారు. ఈక్రమంలో కరీంనగర్ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న లారీ కొదురుపాక కట్ట పరిసరాల్లో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నేపాల్‌కు చెందిన భరత్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న రాజేశ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. రాజేశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని ఎస్సై మహేందర్ పరిశీలించారు.

బాలుడి ఆపరేషన్‌కు పూర్వ విద్యార్థుల చేయూత

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ద్యావ రేవతి–శ్రీకాంత్‌రెడ్డి దంపతుల కుమారుడు రుద్రాన్స్‌రెడ్డి ఆపరేషన్‌కు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు శనివారం చేయూతనందించారు. రుద్రాన్స్‌రెడ్డి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురికాగా, పరిస్థితి విషమించి హైదరాబాద్‌లోని రేయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో చేతిలో చిల్లిగవ్వ లేని వారు ఆపన్నహస్తం కోసం అర్థించారు. 'బాలుడికి ప్రాణభిక్ష పెట్టండి' శీర్షికతో 'సాక్షి'లో వచ్చిన కథనానికి రెండు రోజులుగా దాతలు స్పందిస్తున్నారు. శనివారం అదే గ్రామానికి చెందిన 2006 పదో తరగతి బ్యాచ్ రేయిన్‌బో యూత్ సభ్యులు రూ.21వేలు, మరో 1995–96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.5వేలు సాయం చేశారు. మరి కొంతమంది దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని వారు కోరుతున్నారు.

క్లుప్తంగా

టిప్పర్ ఢీకొని ఒకరు మృతి



రోదిస్తున్న బంధువులు



మల్లేశం (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లి పరిసరాల్లో శనివారం టిప్పర్ ఢీకొని మండలంలోని గుండన్నపల్లికి చెందిన గుంట మల్లేశం(32) అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. ఓ టిప్పర్ స్తంభంపల్లి నుంచి బోయినపల్లి వైపునకు వస్తుంది. అదే సమయంలో గుండన్నపల్లికి చెందిన మల్లేశం బోయినపల్లి నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. స్తంభంపల్లి పరిసరాల్లో టిప్పర్ ఢీకొనడంతో మల్లేశం మృతిచెందాడు. వ్యవసాయం చేసుకుని జీవించే మల్లేశంకు భార్య మౌనిక, కుమారుడు అవినాశ్, కూతురు అనుశ్రీ ఉన్నారు. బంధువులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్సై మహేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అదుపుతప్పి కారు బోల్తా



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శనివారం అతివేగంతో ఓ కారు బోల్తాపడింది. సిరిసిల్ల నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు వేగంగా రావడంతో అదుపుతప్పి ఫుట్‌పాత్‌కు ఢీకొని బోల్తాకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వారు ఎక్కడి వారో తెలియరాలేదు. ఈ కారుపై మూడు నెలల్లో నాలుగు పెండింగ్ చలానాలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని బైపాస్‌రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. బండలింగంపల్లికి చెందిన సురేశ్, రాములు బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో కింద పడ్డారు. ఇద్దరిని ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురిపై గృహహింస కేసు

గంభీరావుపేట(సిరిసిల్ల): అదనపు వరకట్నం కావాలంటూ వేధిస్తున్న అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు. గంభీరావుపేట మండలం మల్లుపల్లికి చెందిన జంపల్లి లావణ్య ఫిర్యాదుతో ముగ్గురిపై వరకట్నం, గృహహింస కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. లావణ్యను రూ.5లక్షలు అదనపు వరకట్నం తేవాలంటూ కొంతకాలంగా భర్త రవి, అత్తామామలు మల్లవ్వ, మల్లయ్య మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.





బలగం సినిమా విజయోత్సవ వేడుక



90ఎంఎల్ ప్రీ రిలీజ్ వేడుక

స్టార్ సిటీ

సినీ విజయోత్సవాలకు వేదికగా మన స్మార్ట్‌సిటీ

సండే స్పెషల్

- నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు..
- కరీంనగర్ వాసులతో వెండితెర హీరోల సంబరాలు
- అప్పుడు వైశ్యభవన్.. ఇప్పుడు క్రీడా మైదానాలు
- ఈ ఏడాదిలో ఇప్పటికే నాలుగు సక్సెస్ మీట్‌లు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ అంటేనే ఉద్యమాలకు వేదిక. కళలకు పుట్టినిల్లు. ఎందరో మహానుభావులు కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పారు. ఉద్యమాలే కాదు.. సినీరంగంలోనూ నగరానికి మొదటినుంచి ప్రత్యేకస్థానం ఉంది. హైదరాబాద్, వరంగల్ తరువాత కరీంనగర్‌లోనే సినిమాలకు సంబంధించిన ప్రీరిలీజ్ ఫంక్షన్లు, ఆడియో రిలీజ్ వేడుకలు, విజయోత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. సినీ ప్రస్థానంలో 60 ఏళ్ల నుంచి విజయోత్సవాలకు కరీంనగర్ వేదికైంది. నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు ప్రతీ విజయాన్ని సినీ హీరోలు నగర ప్రజలతో పంచుకుంటున్నారు. ఓ వైపు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న నగరంలో.. అప్పుడప్పుడు స్టార్స్ కూడా వచ్చి తళుక్కున మెరుస్తున్నారు. కరీంనగర్‌లో వెండితెర వెలుగులపై సండే స్పెషల్..!!

తొలివేడుక ఇదే..

అంజలి పిక్చర్స్ బ్యానర్‌పై నటి అంజలి దేవీ, అక్కినేని నాగేశ్వరరావు హీరోగా ఆదినారాయణరావు నిర్మించిన సువర్ణ సుందరి సినిమా 1957 మే 10న విడుదలైంది. ఉమ్మడి రాష్ట్రంలోని 18 కేంద్రాల్లో 100 రోజులు ప్రదర్శించబడింది. కరీంనగర్‌లోని రోజ్ టాకీస్‌లో ఈ చిత్రం 100 రోజులు విజయవంతంగా ప్రదర్శింపబడిన సందర్భంగా విజయోత్సవం నిర్వహించారు. విజయోత్సవయాత్రలో భాగంగా అక్కినేని నాగేశ్వరరావు, అంజలిదేవీ, తదితరులు రోజ్‌టాకీస్‌కు వచ్చి ప్రేక్షకులతో వేడుకలు జరుపుకున్నారు.

కరీంనగర్‌ది ప్రత్యేక స్థానమే..

తెలుగు చలనచిత్ర చరిత్రలో కరీంనగర్ జిల్లాది ఎప్పటికీ ప్రత్యేకస్థానమే. జిల్లాకు చెందిన బీఎస్ నారాయణ తన సినిమాల ద్వారా తెలంగాణ సినీ చరిత్రను ప్రపంచానికి చాటారు. జాతీయస్థాయిలో మొదటిసారిగా ఉత్తమ నటి, రెండు జాతీయ అవార్డులను నిమజ్జనం చిత్రం ద్వారా అందించి కరీంనగర్ చిత్రకీర్తిని చాటారు. 1991లో కరీంనగర్‌లోని ఔత్సాహిక నటులతో 'మార్గదర్శి' చిత్రం ఉత్తమ జాతీయ సమైఖ్యత చిత్రంగా నిలిచి నందిఅవార్డు గెలుచుకుంది. 'నన్ను దోచుకుందువటే వన్నెలదొరసాని' పాటతో చిత్రరంగంలో ప్రవేశించిన జ్ఞానపీఠఅవార్డు గ్రహీత, డాక్టర్ సి.నారాయణరెడ్డి, దాదా సాహెబ్ పాల్కె అవార్డు అందుకున్న పైడి జయరాజ్, హిందీ, తెలుగు భాషల్లో చిత్రాలు నిర్మించిన కేకేరెడ్డి, దర్శకుడిగా రాణించిన కె.రుష్యేందర్‌రెడ్డి, తెలుగు సినిమాలో కరీంనగర్ తడాఖా చూపిస్తున్న సంపత్ నంది, హరీశ్‌శంకర్, పత్తి సురేందర్‌రెడ్డి, పైడిపెల్లి వంశీ, వేణుశ్రీరాం, కస్తూరి శ్రీనివాస్, బలగం దర్శక నటుడు వెల్దండి వేణు ఉమ్మడి జిల్లాకు చెందినవారే. వీరేకాకుండా కొత్తనటులు, దర్శకులు సినీరంగంలో కరీంనగర్ ఖ్యాతిని ఇప్పటికీ చాటుతున్నారు.

నాడు వైశ్యభవన్



కరీంనగర్‌లో వైశ్యభవన్

కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో ఉన్న వైశ్యభవన్ నాడు సినిమా విజయోత్సవ వేడుకలకు వేదికగా నిలిచింది. కరీంనగర్‌లో తొలిసారిగా పిట్టలదొర సినిమా 50రోజుల వేడుక జరిగింది. చొప్పదండికి చెందిన భాగ్యలక్ష్మి సాన క్రియేషన్ బ్యానర్‌పై 1996లో సాన యాదిరెడ్డి దర్శకత్వంలో ఆలీ, ఇంద్రజా జంటగా నటించిన పిట్టలదొర సినిమా 50రోజుల వేడుకలను వైశ్యభవన్‌లో నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు డిస్ట్రిబ్యూషన్ తీసుకున్న కటకం వెంకటరమణ, చిత్ర నటీనటులు, సాంకేతిక సిబ్బందిని ఘనంగా సన్మానించారు. 1997లో ఒసేయ్ రాములమ్మ సినిమా విజయోత్సవ వేడుకకూడా ఇక్కడే నిర్వహించారు. కరీంనగర్‌కు వచ్చిన దాసరి నారాయణరావు, విజయశాంతి, తదితరులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా 1998లో రవీంద్రఆర్ట్స్ బ్యానర్‌పై నటి రోజా ప్రధాన పాత్రలో నటించిన స్వర్ణక్క సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్‌ను గాంధీరోడ్‌లోని సంస్కృతిక పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో తమ్మారెడ్డి భరద్వాజ, నటి రోజా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఏర్పడిన తరువాత



తిరుమలటాకీస్‌లో హీరో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ నటించిన 100 చిత్రం గౌతమీపుత్ర శాతకర్ణి ట్రైలర్‌ను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా 2016 డిసెంబర్ 16న కరీంనగర్‌లోని తిరుమల థియేటర్‌లో రిలీజ్ చేశారు. బాలకృష్ణతోపాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. కార్తీకేయ, నేహా సోలంకి హీరో, హీరోయిన్‌గా నటించిన 90 ఎంఎల్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు 2019 డిసెంబర్ 1న కరీంనగర్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా మంత్రి గంగుల కమలాకర్, సినిమా హీరో, హీరోయిన్, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. వీటితో పాటు మరికొన్ని సినిమాల విజయోత్సవ వేడుకలు, ఇతర ఫంక్షన్లు జరిగాయి.

ఈ ఏడాదిలో నాలుగు ఫంక్షన్లు..



రాజ్‌కహానీ విజయోత్సవ సభ

2023లో ఈ మూడున్నర నెలల వ్యవధిలో మూడు పెద్ద సినిమాల ఫంక్షన్లు కరీంనగర్ వేదికగా జరిగాయి. మార్చి 12న రాంనగర్ మార్క్‌ఫెడ్ మైదానంలో విశ్వక్‌సేన్ నటించి, దర్శకత్వం వహించిన దస్ కా దమ్కీ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. సిరిసిల్లకు చెందిన వెల్దండి వేణు నటించిన బలగం సినిమా విజయోత్సవాన్ని 2023 మార్చి 15న కరీంనగర్‌లోని జ్యోతిరావుపూలే మైదానంలో నిర్వహించారు. మార్చి 24న కరీంనగర్‌కు చెందిన కార్తికేయ హీరోగా నటించిన రాజ్ కహానీ చిత్రం విజయోత్సవ సభను తిరుమల థియేటర్‌లో నిర్వహించారు. ఏప్రిల్ 5న నాని హీరోగా నటించిన దసరా సినిమా విజయోత్సవాన్ని ఎస్సారార్ కాలేజీ మైదానంలో నిర్వహించారు. ఈనెల 27న విశ్వతేజ్ నటించిన కౌశిక్‌వర్మ దమయంతి సినిమా ఆడియోఫంక్షన్ కరీంనగర్‌లో జరగనుంది.

స్టోన్ క్రషర్‌ను మూసివేయాలి

- టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి ఉమేశ్‌రావు



క్రషర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శాంభవి స్టోన్ క్రషర్‌ను మూసివేయాలని, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చీటి ఉమేశ్‌రావు అన్నారు. శనివారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి స్టోన్ క్రషర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతీ మండలానికి మంత్రి కేటీఆర్ మాఫియాలను తయారు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లెల్ల శివారులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు అక్రమంగా స్టోన్ క్రషర్‌ను నడిపిస్తున్నారని ఆరోపించారు. స్టోన్ క్రషర్ మూలంగా చుట్టుపక్కల ఉన్న బోరు బావులు, పంట పొలాలు దెబ్బ తింటున్నాయని తెలిపారు. క్రషర్‌పై రైతులు ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. క్రషర్‌లో మంత్రి కేటీఆర్‌కు సంబంధించి కొందరు బీఆర్ఎస్ నాయకులు, పర్సనల్ సెక్రటరీ, మైనింగ్ ఏడీకి వాటలున్నాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేస్తున్న క్రషర్‌ను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకముందు జిల్లెల్లలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ఉమేశ్‌రావు సందర్శించారు. నిర్మాణం పూర్తి అయినా లబ్ధిదారులకు అందజేయకపోవడం సరికాదని విమర్శించారు. వెంటనే అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసరి బాలరాజుయాదవ్, ఓరుగంటి తిరుపతి, ఎడమల భూపాల్‌రెడ్డి, మహిపాల్, చుక్క శేఖర్, చోటు, ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, అజయ్, లింగారెడ్డి, కటకం రాజశేఖర్, నరేష్‌యాదవ్, నర్రా బాల్‌రెడ్డి, ఎండీ సర్దార్‌ఖాన్, మండెపల్లి దేవయ్య, మొగిలి సంపత్, జాగిరి వేణు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై అనుమానాలు

- ప్రేమ విషయంలో దాడి చేశారని తండ్రి ఫిర్యాదు
- కోరెం బీరప్ప పట్నాల దావత్‌లో ఘటన
- మృతుడు చందుర్తి మండలం లింగంపేటవాసి
- లింగంపేటలో విషాదం



శివ(ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి)/చందుర్తి(వేములవాడ): బీరప్ప ఉత్సవాలకు వెళ్లిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం లింగంపేటలో శనివారం విషాదం నింపింది. స్థానికులు, మృతుని బంధువులు, బోయినపల్లి ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాలు. చందుర్తి మండలంలోని లింగంపేటకు చెందిన బండారి శివ (19) కొద్ది రోజులుగా అదే మండలంలోని ఎన్గల్‌కు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ విషయంలో యువతి బంధువులు పలుమార్లు శివను బెదిరించారు. ఈనెల 11న బోయినపల్లి మండలం కోరెంలో జరిగే బీరప్ప ఉత్సవాలకు బంధువుల ఇంటికి వెళ్లాడు. అదే గ్రామంలోని తన బంధువుల ఇంటికి శివ ప్రేమిస్తున్న యువతి సైతం వచ్చింది. అదే సమయంలో సదరు యువతి ఫొటోలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించినట్లు ఆమె బంధువులు గమనించారు. వెంటనే శివ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని ఫొటోలు తొలగించి.. చెంపపై రెండు దెబ్బలు కొట్టి అక్కడి నుంచి పంపించి వేశారు. ఉత్సవాల మరుసటి రోజు బుధవారం తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పొలం వద్ద శివ గాయాలతో పడి ఉన్నాడు. ఈ విషయం అతని మేనమామ ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పందుల తరలింపు వివాదాస్పదం

- అడ్డుకున్న పెంపకందారులు
- పోలీసులకు జీపీ అధికారుల ఫిర్యాదు
- నలుగురిపై కేసు



పందులను వ్యాన్‌లో ఎక్కిస్తున్న కూలీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మెజర్ గ్రామ పంచాయతీలో పందులను ఊరు దాటించడం వివాదాస్పదమైంది. పందులను వ్యాన్‌లో ఎక్కించి ఊరు దాటించే క్రమంలో పెంపకందారులు అడ్డుకున్నారు. పందులను బంధించే కూలీలతో ఘర్షణకు దిగారు .ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి దేవరాజు ఫిర్యాదుతో నలుగురు పందుల పెంపకందారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటలో యథేచ్ఛగా తిరుగుతున్న పందులను గ్రామానికి దూరంగా ప్రత్యేక షెడ్లు వేసి తరలించాలని పంచాయతీ అధికారులు పెంపకందారులకు నోటీసులు ఇవ్వగా.. వారు పట్టించుకోలేదు. పందులతో పడుతున్న ఇబ్బందులపై గ్రామస్తులు మరోసారి ఫిర్యాదు చేయగా.. శనివారం పంచాయతీ కార్యదర్శి దేవరాజు ఆధ్వర్యంలో కామారెడ్డి నుంచి కూలీలను తెప్పించారు. వారు 30 పందులను బంధించి వ్యాన్‌లో వేశారు. ఈ విషయం తెలుసుకున్న పెంపకందారులు వ్యాన్‌ను అడ్డుకున్నారు. పందులను బంధించిన కూలీలతోపాటు అధికారులపై అసభ్య పదజాలంతో దూషిస్తూ విధులకు ఆటంకం కల్గించారు. వ్యాన్‌లో ఎక్కించిన పందులను కిందికి దించి అక్కడి నుంచి పంపించారు. విధులకు ఆటంకం కల్గించిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దమ్మన్నపేట విద్యార్థుల ప్రతిభ

- ఉత్తమ ప్రాజెక్టుగా ఉమెన్స్ ఫ్రెండ్లీ యుటెన్సిల్స్ సపోర్టర్



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఫ్ఐఎఫ్-2023 ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ ఫెయిర్ వైజ్ఞానిక ప్రదర్శనలో గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైంది. పొన్నాల వినీల, నందు, శ్రీచైత్ర, సుప్రియ సంయుక్తంగా రూపొందించిన 'ఉమెన్స్ ఫ్రెండ్లీ యుటెన్సిల్స్ సపోర్టర్' ప్రాజెక్టును నిర్వాహకులు ఎంపిక చేశారు. భారత బయోటెక్ చైర్మన్ కృష్ణ ఎల్లా చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. విద్యార్థులను, గైడ్ టీచర్ సంపత్‌ను డీఈవో రమేశ్‌కుమార్, హెచ్ఎం నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ తదితరులు అభినందించారు.

వేములవాడ జడ్జి దంపతులకు అభినందనలు



జడ్జి పెళ్లికి హాజరైన వేములవాడ బార్ అసోసియేషన్ అడ్వకేట్లు

వేములవాడ: వేములవాడ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ప్రతీక్‌సిహాగ్ పెళ్లి హర్యానాలోని ఫరీదాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. జడ్జి సట్టు రవీందర్, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంటరాజు, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్‌తోపాటు అడ్వకేట్లు హాజరై రాజన్న చిత్రపటాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

ముస్తాబాద్(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో ఏకైక కుమారుడిని కోల్పోయిన కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో కంచం నవీన్ మృతిచెందగా.. ఆయన తల్లిదండ్రులను లగిశెట్టి శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సీనియర్ నాయకుడు మేర్గు హన్మంత్‌గౌడ్, మీస సంజీవ్, కోల కృష్ణ, జనార్దన్, సంతోష్‌రెడ్డి, వరి వెంకటేశ్, గోపి, రమేశ్, కల్యాణ్, రాంగోపాల్, శ్రీకాంత్, జీవన్, బాలాజీ, ఆదిత్య, మహేశ్ తదితరులున్నారు.

21 నుంచి శంకర జయంతి వేడుకలు

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 21 నుంచి 25 వరకు జగద్గురు శంకరాచార్యులు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఐదు రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. పంచోపనిషత్ ద్వారా అభిషేకాలు, శంకరభాష్యం, బ్రహ్మాసూత్రభాష్యం, శంకర విజయపురాణం, శంకరాచార్య సహస్ర నామ పారాయణములు ఉంటాయని పేర్కొన్నారు. 25న సాయంత్రం సదస్యం, వసంత మాధవ పూజలతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాకు చెందిన బానోతు బావుసింగ్(48) మలేషియాలో ఈనెల 7న మృతిచెందాడు. మంత్రి కేటీఆర్ చొరవతో బావుసింగ్ మృతదేహం శనివారం హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు రాగా.. సర్పంచ్ రవి ఆధ్వర్యంలో ఉచితంగా సమకూర్చిన అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చారు. బావుసింగ్ కడసారి చూపు కోసం బంధువులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

నృత్య కళానికేతన్ కార్యవర్గం



నియామకమైన నూతన కార్యవర్గం

వేములవాడఅర్బన్: వేములవాడలోని నృత్య కళానికేతన్ సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని శనివారం నియమించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోచెట్టి తెలిపారు. న్యాయ సలహాదారులుగా నేరెళ్ల తిరుమల్‌గౌడ్, గౌరవ సలహాదారులు బొజ్జ కనకయ్య, బొడ్డు రాములు, వారాల దేవయ్య, కేశన్నగారి రాధిక, గౌరవ అధ్యక్షులుగా సోమినేని బాలు, హన్మండ్లు, శ్రీకాంత్, అధ్యక్షుడిగా మానువాడ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా మిద్దె వినీత్‌గౌడ్, వెదిరె రవిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంపటి సంతోశ్‌కుమార్, కోశాధికారిగా కృష్ణ, సాంస్కృతిక కార్యదర్శులుగా రాజేశం, ప్రశాంత్, నర్సయ్య, ప్రచార కార్యదర్శులుగా సాయికుమార్‌ను నియమించినట్లు తెలిపారు.

కలప కిరికిరిపై సీఐ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో పట్టుకున్న కలపలో పోలీసుల పాత్రపై సీఐ కిరణ్‌కుమార్ విచారించినట్లు తెలిసింది. 'ఖాకీలకు కలప కిరికిరి' శీర్షిక 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైంది. ఎన్గల్‌కు చెందిన లాండే రాములును విచారించగా.. మరొకరి పేరు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఇద్దరిని సీఐ కార్యాలయానికి ఆదివారం రావాలని ఆదేశించినట్లు సమాచారం.

క్లుప్తంగా

రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు



ఎస్సై నాగరాజు

వేములవాడరూరల్: రోడ్లమీద ఎవరైనా ధాన్యం కుప్పలు ఆరబోస్తే అక్కడ ప్రమాదాలు జరిగినా వారిదే బాధ్యత ఉంటుందని వేములవాడరూరల్ ఎస్సై నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా గ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరబెట్టి వాటిపై నల్లటికవర్లు కప్పి రాళ్లు, కట్టెలు, టైర్లు అడ్డుపెట్టడంతో అవి కనబడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అలాంటి ఘటనలు జరిగితే సంబంధిత వ్యక్తులపై వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దని సూచించారు.

బద్దెనపల్లి పాఠశాలలో డీఈవో సందర్శన



విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న డీఈవో

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి ప్రభుత్వ పాఠశాలను శనివారం డీఈవో రమేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నిర్వహిస్తున్న ఎస్‌ఏ–2 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన గది, పరిసరాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా బద్దెనపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.. వారి ప్రతిభను తెలుసుకునేలా ప్రశ్నలు సంధించి జవాబులు రాబట్టారు. జెడ్పీహెచ్‌ఎస్ బద్దెనపల్లి హెచ్‌ఎం ఈ.వీరారెడ్డి, ఎంపీపీఎస్ హెచ్‌ఎం తిరుపతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్

ఇల్లంతకుంట: మండలంలోని 33 గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆస్పత్రిలో పలు రికార్డులను పరిశీలించి, ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, వైద్యాధికారి శరణ్య, ఏఈ కిరణ్, నాయకులు రఘు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం



బట్ట సంచులు అందిస్తున్న సర్పంచ్ వనజ

ముస్తాబాద్: ప్లాస్టిక్ రహిత గ్రామంగా మోహినికుంటను తీర్చిదిద్దాలని సర్పంచ్ కల్వకుంట్ల వనజ అన్నారు. మోహినికుంటలో ప్లాస్టిక్, పాలిథీన్ కవర్ల వినియోగంపై దుకాణ యజమానులకు శనివారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను వివరించారు. గ్రామంలో ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను నిషేధిస్తున్నామన్నారు. ప్రజలు బట్టసంచులు, జనపనార సంచులు వాడాలన్నారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామన్నారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, ఉపసర్పంచ్ సంధ్య, కార్యదర్శి రాపెల్లి గీత, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



ఫర్నిచర్ అందిస్తున్న ఆరెల్ల కృష్ణ

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లికి చెందిన ఎంపీటీసీ సభ్యులు ఈసంపల్లి హేమ భర్త దేవేందర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు ఆయన జ్ఞాపకార్థం ఆరెల్ల కృష్ణ, స్థానిక ప్రాథమిక పాఠశాలకు రూ.13వేలు విలువైన ఫర్నిచర్ అందించారు. భవిష్యత్‌లో పాఠశాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణ, హెచ్‌ఎం గౌతమి, శ్రీలత, సుశీల, నాయకులు కొమురయ్య, నాగరాజు, బాలకృష్ణ, రాజు, ఉపాధ్యాయులు మమత, నాగమణి, సౌజన్య ఉన్నారు.

అదుర్స్.. సబ్లిమేషన్..

- వెరైటీల్లో ఫొటో ప్రింటింగ్స్
- సబ్లిమేషన్ ప్రింటింగ్ తళుక్కులు
- గిఫ్ట్ ఆర్టికల్స్‌గా ఉపయుక్తం...
- కొత్తదనానికి పెరుగుతున్న ఆదరణ



సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: ప్రింటింగ్‌లో ఆధునిక టెక్నాలజీ అదుర్స్ అనిపిస్తోంది. ప్రజలు తమ మధుర జ్ఞాపకాలను పదికాలాల పాటు పదిలపర్చుకునేందుకు తహతహలాడుతున్నారు. ఐతే జ్ఞాపకాలను కూడా వెరైటీగా పదిలం చేసుకోవడం ఓ మధుర జ్ఞాపకంగా మిగిలిపోతోంది. ఫొటో ప్రింటింగ్‌లో వచ్చిన సరికొత్త ఒరవడి నవనాగరికతను ప్రతిబింబిస్తోంది. వివిధ రకాల వస్తువులపై ఔరా అనిపిస్తూ..సరికొత్త టెక్నాలజీతో ఫొటో ప్రింటింగ్ పద్ధతి కొత్త పుంతలు తొక్కుతూ.. ఆకట్టుకుంటున్న సబ్లిమేషన్ ప్రింటింగ్‌పై సండే స్పెషల్ స్టోరీ మీకోసం...

వెరైటీగా..వాడేస్తున్నారు

టీకప్పులపై వెరైటీగా తమ ఫొటోలను అచ్చు వేసుకోవడం ఫ్యాషనైంది. సబ్లిమేషన్ ప్రింటింగ్ ద్వారా ఈ తరహా కొత్తదనాన్ని పొందవచ్చు. సాధారణంగానే టీ, కాఫీ కప్పులపై పర్సనల్ ఫొటోలు అచ్చువేసుకోవడం ప్రస్తుతం ఫ్యాషన్‌గా మారింది. అయితే సబ్లిమేషన్ ప్రింటింగ్ ద్వారా కప్పులో వేడి పదార్థాలను పోయగానే అప్పటి వరకు సాధారణంగా ఉన్న కప్పులపై మనం ఇష్టపడి వేయించుకున్న ఫొటోప్రింట్స్ వేడి పదార్థం పోయగానే కనిపించడం దాని ప్రత్యేకత. కప్పులు చల్లబడ్డాక మళ్లీ సాధారణ కప్పుల్లా ఉండిపోతాయి. చిన్న పిల్లలు, విద్యార్థులకు ఇలాంటి కప్పులు ఆకట్టుకుంటున్నాయి. జనాలు సాధారణ డీటీపీ సెంటర్ల నుంచి ఫొటోల్యాబ్స్ వరకు వీటికోసం పరుగులు పెట్టడం విశేషం. ఇష్టమైన వారికి ప్రత్యేక రోజుల్లో బహుమతులు ఇచ్చేందుకు వీటిని ఇష్టపడుతున్నారు.

డిఫరెంట్‌గా..

సబ్లిమేషన్ పద్ధతి డిఫరెంట్ టెక్నాలజీ. ప్రింటింగ్ టెక్నాలజీలో ఆధునిక ఫ్యాషన్. దీని వినియోగంతో మార్కెట్‌లో కొత్తరకంగా ఫొటోలు ప్రింట్ చేస్తున్నారు. సాధారణంగా ఫొటోలను పేపర్‌పై ప్రింట్‌చేస్తారు. కానీ సబ్లిమేషన్ పద్ధతిలో కొన్ని ప్రత్యేకమైన వస్తువులపై పదికాలాల పాటు చెక్కుచెదరకుండా ఫొటోలు ప్రింట్ చేస్తారు. ఈ పద్ధతిలో చేసే ప్రింటింగ్ మామూలు ఫొటో ప్రింట్లకు, ఇతర ప్రింట్ల కన్నా..ప్రత్యేక ఆకర్షణగా ఉంటోంది. దీంతో చాలామంది ఫొటో ప్రియులు దీనిని ఆదరిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలో చాలామంది యువత ఈ ప్రింటింగ్ స్టూడియోలు నిర్వస్తూ.. నిరంతరం ఉపాధి పొందుతున్నారు.

సమ్‌థింగ్ స్పెషల్‌గా..

సబ్లిమేషన్ పద్ధతుల్లో వివిధ రకాలైన వస్తువులపై ఫొటోలు అచ్చువేస్తున్నారు. సాధారణంగా ఉండే పేపర్ ఫొటోల కన్నా..ఇవి వెరైటీగా ఉంటున్నాయి. సబ్లిమేషన్ ప్రింటింగ్ కోసం కొన్ని ప్రత్యేకమైన వస్తువులు టైల్స్, గ్రానైట్ స్టోన్, మెటల్‌కప్స్, వుడ్‌తో తయారుచేసిన ఫొటోఫ్రేంలు వంటివి అందుబాటులో ఉన్నాయి. ఇక చాలామంది కీచైన్స్, నిద్రించేప్పుడు తమకు నచ్చిన ఫోటోలను చూస్తూ..చూసేలా పిల్లోస్(దిండ్లు)పై ఫొటోలు ప్రింట్ చేయించుకుంటున్నారు. వీటి ధరకూడా సాధారణంగా ఉండడంతో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు తమకు నచ్చినరీతిలో వీటిని వినియోగిస్తున్నారు. సిరిసిల్లలో ల్యాబ్ నిర్వాహకులు వివిధ వస్తువులపై కస్టమర్లు కోరిన ఫొటోలను ప్రింట్ వేయడానికి రూ. 200 నుంచి రూ. 2వేల వరకు తీసుకుంటున్నారు.

ప్రత్యేకతకు ప్రాధాన్యం...



కస్టమర్లు బహుమతులు, ఇంట్లో డెకరేషన్‌కు వినియోగించే వస్తువులకు సబ్లిమేషన్ ప్రింటింగ్ థింగ్స్‌ను ఆదరిస్తున్నారు. ఆర్డర్లు ఇచ్చిన మూడు గంటల్లోపే వారు కోరిన వస్తువులపై ప్రింట్ వేసి ఇస్తున్నాం. టైల్స్, స్టోన్స్, వుడ్, ఫోటోస్ వగైరా వాటిపై ప్రింటింగ్ వేస్తాం. ముఖ్యంగా ఇష్టమైన వారికి ప్రత్యేక అభిమానాన్ని చాటుతూ..బహుమతులు ఇచ్చేందుకు ఈ ప్రింటింగ్స్ ఉపయుక్తంగా ఉన్నాయి.

పత్తిపాక ముక్తేశ్వర్, సబ్లిమేషన్ ప్రింటర్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్సై శేఖర్



చందుర్తిలో వాహనాల తనిఖీచేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై శేఖర్ అన్నారు. రాచర్లగొల్లపల్లి వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదుచేశారు. వాహనాలను సీజ్‌చేసిస్టేషన్‌కు తరలించారు. ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగివాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవన్నారు. వాహనదారులు సరైన ధృవపత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చందుర్తిలో వాహనాల తనిఖీ

చందుర్తి: బస్టాండ్ ప్రాంతంలో ఎస్సై జిల్లెల్ల రమేశ్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు, వాహన పత్రాలు తనిఖీచేశారు. హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడుతూ.. నంబర్ లేని వాహనాలను సీజ్‌చేస్తామని, ప్రతి వాహనానికి నంబర్ కలిగి ఉండాలన్నారు. నంబర్‌ను ట్యాపరింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ సతీశ్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

స్క్రాప్‌గా మారిన స్వచ్ఛభారత్ రిక్షా

ముస్తాబాద్: మేజర్ పంచాయతీకి ఆరేళ్ల క్రితం అందించిన స్వచ్ఛభారత్ రిక్షాలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ప్రతి పంచాయతీకి ట్రాక్టర్లు, వ్యాన్‌లు రావడంతో రిక్షాలను వాడేవారు కరువయ్యా రు. ముస్తాబాద్‌లో సెస్‌భవన్ పక్కన ఇలా ఎండకు ఎండి, వానకు తడిసి ఎందుకు పనికిరాకుండా పోయిన రిక్షా దర్శనమిస్తోంది. పూర్తిగా తుప్పుబట్టిన ఇలాంటి రిక్షాలు ఇంకా ఉన్నాయి. వాటిని వినియోగించి సంరక్షిస్తే మరో ఐదేళ్లైనా పనికివచ్చేవని భావిస్తున్నారు. అధికారుల ఆజామాయిషీ లేక సిబ్బంది ఎక్కడ పడితే అక్కడ రిక్షాలను వదిలేశారు.



తుప్పబట్టిన చెత్త రిక్షా

హెచ్చరిక బోర్డులు మరిచారు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి మూలమలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ అతి ప్రమాదకరమైన ఈ మూలమలుపు వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారిపై మూలమలుపు వద్ద రాత్రిపూట ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్త వ్యక్తులు ప్రయాణిస్తున్న సందర్భాల్లో హెచ్చరిక బోర్డులు లేక దగ్గరకు వచ్చే వరకు రోడ్డు పరిస్థితి తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సీడీపీవో, ఎంపీడీవో

రుద్రంగి: వికలాంగుల కోటలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ సూచనలతో శనివారం రుద్రంగి మండల పరిషత్‌లో సీడీపీవో ఎల్లయ్య ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుద్రంగి ఎంపీడీవో శంకర్, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

ఫైర్‌సేఫ్టీ పరిశీలన



ఫైర్ సేఫ్టీని పరిశీలిస్తున్న అధికారులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల, లింగన్నపేట సాయిమోడల్ స్కూల్‌లో అధికారులు శనివారం ఫైర్‌సేఫ్టీ చర్యలు పరిశీలించారు. అగ్నిప్రమాదాలు నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, చిట్టంపల్లి రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కోనరావుపేట: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి నేడు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2023–24 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో, 7–10 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10–12 గంటల మధ్య, 7–10 తరగతులకు మధ్యాహ్నం 2–4 గంటల మధ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్లకు చెందిన పెంటల అఖిలకు రూ. 14,500, పెంటల మల్లయ్యకు రూ.14వేలు, జంగిటి మమతకు రూ.18వేలు, కొండికొప్పుల మహేందర్‌కు రూ.9వేలు, చింతల సౌజన్యకు రూ.24వేలు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం బాధితులకు సర్పంచ్ అనసూయ అందించారు. ఎంపీటీసీ స్రవంతి, నాయకులు మల్లారెడ్డి, భాస్కర్, ప్రశాంత్ ఉన్నారు.

నియామకం

వీర్నపల్లి: మండల పంచాయతీ కార్యదర్శులు జేపీఎస్ అధ్యక్షుడు బుగ్గ రాములు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమి టీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా బానోత్ రాజు, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి ప్రవీణ్, కోశాధికారిగా ఉస్మాన్, ప్రధానకార్యదర్శిగా బొల్లారపు కృష్ణ, సలహాదారులుగా గాజుల పురుషోత్తం, గౌరవ సలహాదారులుగా ఐలవేని తిరుపతి ఎన్నికయ్యారు. రాజు మాట్లాడుతూ.. రెగ్యులరైజేషన్ కోసం ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందించామన్నారు.

జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు



కార్యవర్గ సభ్యులతో ప్రతాప రామకృష్ణ

వేములవాడ: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచేది జర్నలిస్టులని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్‌తోపాటు నూతన కార్యవర్గాన్ని ఆయన శనివారం భీమేశ్వరగార్డెన్‌లో సన్మానించారు. బీజేపీ నాయకులు గోపు బాలరాజు, నందిపేట సుదర్శన్‌యాదవ్, బండ మల్లేశం, ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, రేగుల సంతోష్‌బాబు, కిష్టస్వామి, ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం



రుద్రంగి: మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహానికి రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి శనివారం రూ.25వేలు విరాళం అందించారు. ఈ నగదును రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య నాయకులతో కలిసి అంబేడ్కర్ ఐక్య సంఘం సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీకి అంబేడ్కర్ ఐక్య సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగం మహేశ్, మంచె రాజేశం, కేసిరెడ్డి నర్సారెడ్డి, కంటి రెడ్డి, దయ్యాల కమలాకర్, వెంకటి,అంబేడ్కర్ ఐక్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డుల ప్రదానం



అవార్డులతో నాయకులు

ముస్తాబాద్: మండలానికి చెందిన నాయకులు దళితరత్న అవార్డులను రవీంద్రభారతిలో అందుకున్నారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ వర్గాల అభ్యున్నతికి అందిస్తున్న సేవలకు గాను దళితరత్న అవార్డులను ప్రతి సంవత్సరం హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ బాబు జగ్జీవన్‌రామ్ జయంతోత్సవ కమిటీ అందిస్తోందని అవార్డు గ్రహీతలు కాంపెల్లి శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్ తెలిపారు. అవార్డులను తెర్లుమద్ది మాజీ సర్పంచ్ ఈసరి కృష్ణ, పోతుగల్‌కు చెందిన జంగ భూమరాజు, మొర్రాయిపల్లెకు చెందిన పిట్ల చంద్రం, నర్సయ్యకు అందించినట్లు తెలిపారు. అవార్డులు అందుకున్న వారిని అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి: గతనెల మస్కట్‌లో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన కుర్మ మల్లేశం కుటుంబ సభ్యులను శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతదేహం త్వరగా ఇండియాకు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుపేద బాధిత కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం నాయకులు తర్రె మనోహర్, పల్లి గంగాధర్, సామ మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'గెల్లు'కు అభినందనల వెల్లువ





అభినందిస్తున్న గూడూరి ప్రవీణ్, మనోహర్‌రెడ్డి

సిరిసిల్ల: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) చైర్మన్‌గా నియమితులైన గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీపీటీడీసీ) చైర్మన్ గూడూరి ప్రవీణ్ శనివారం కలిసి అభినందించారు. టీఎస్‌టీడీసీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్ యాదవ్‌ను గూడూరి ప్రవీణ్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి బాటలు వేయాలని ప్రవీణ్ కోరారు.

'గెల్లు'కు రాజన్న ప్రసాదం

వేములవాడఅర్బన్: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను హైదరాబాద్‌లో వేములవాడ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న ప్రసాదం అందజేశారు.

భళా..అభి'రుచుల' కళ..

- అలరించిన ఫుడ్ ఫెస్టివల్..
- ఆకట్టుకున్న ట్రెడీషనల్ ఫ్యాషన్
- కళాశాల విద్యార్థుల ప్రతిభ



సిరిసిల్లటౌన్: సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పడుతూ..తెలంగాణ వంటకాలను రంగరిస్తూ.. వండిన వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల అభి'రుచుల' కళ ఆకట్టుకుంది. స్వయం పాకంతో నాటుకోడి చికెన్..నాన్‌వెజ్ స్నాక్స్..తాళి భోజనం..గుత్తివంకాయ కూర..తాజా కర్రీస్‌ను విద్యార్థులు తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. 125 మంది విద్యార్థులు వంటకాల్లో తమదైన శైలిలో ప్రత్యేకతను చాటగా..కళాశాలలోని విద్యార్థులంతా 1980 మొదలుకుని 2010 వరకు దేశసంస్కృతి, సంప్రదాయాల దుస్తులను ధరించి ఫ్యాషన్ పరేడ్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా సాగిన ఈ కార్యక్రమానికి సిరిసిల్ల పట్టణంలోని వాసవీ కల్యాణ మండపం వేదికైంది. జడ్జిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు దార్నం అరుణ, గడ్డం లత, దిడ్డి మాధవి, బీఆర్‌ఎస్ మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు బత్తుల వనజ వ్యవహరించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.